# తిరుగు ప్రయాణం

జలజ దగ్గరనుండి చెల్లెలికి ఉత్తరం వచ్చింది. 'ఇందూ మీ బావా నేనూ సోమవారం జనతాలో మీ వూరిమీదుగా వెళ్తున్నాం. ఒకసారి స్టేషనుకు రా. నిన్ను చూడాలని చాలా రోజులబట్టి అనుకుంటున్నాను. అమ్మనుకూడా తీసుకురా. జనతా మనవూరు చేరేటయిము మరీ రాత్రేంకాదుకనుక ఫరవాలేదు. ఇద్దరూరండి'-అంటూ రాసింది. ఆ ఉత్తరంతోపాటే యాభైరూపాయలు మనియార్డరుకూడా చేసినట్టు చివర్లోరాసింది.

"ఎక్కడనుంచే?" అంది తల్లి వీధిలోకొచ్చి.

ఉత్తరం సారాంశాన్ని మూడుముక్కల్లో ఆమెకు చెప్పి "నువ్వూ రావే అమ్మా అక్కయ్య రమ్మందిగా" అంది. కాని ఆమె ఏమీ మాట్లాడలేదు.

"ఏం, రావూ?" అంది తలెత్తి తల్లి ముఖంలోకి చూస్తూ. చూడగానే ఆమె నిర్విణ్ణురాలైపోయింది. తల్లికళ్ళల్లో కన్నీళ్ళు సుళ్ళుతిరుగుతున్నాయి.

తల్లి ఎందుకు బాధపడుతున్నదీ ఇందుమతికి తెలుసు. అక్కనుగురించి తల్లి బాధపడడంలో వింతేమీలేదు. అక్కంటే అమ్మకు ప్రాణం. తనన్నా అంతే.

అలాంటి అక్క తననీ, తల్లినీ, యింటినీ అన్నిట్నీ వదిలి సూర్యంతో ఎలా

వెళ్ళిపోయిందో అర్థంకాదు. జలజ వెళ్ళిపోయిన రెండు నెలలకు రెండు వందల రూపాయలు మనియార్డరుచేస్తూ ఒక ఉత్తరం రాసింది.

'అమ్మా ఏంచెయ్యను? నువ్వా-నాకు పెళ్ళిచేయలేకపోయావ్. మన ఆర్థిక పరిస్థితా- ఏమీ బాగాలేదు. నాన్న పోయాక ఇల్లు అమ్మి అప్పులు తీర్చేస్తే నీ దగ్గర మిగిలిందేమిటి చెప్పు? నన్నింతకాలం యింట్లో వుంచావుకదా, ఎలా పెళ్ళిచేయాలను కున్నావ్? పోనీ-ఇందు..అదింకా చిన్నపిల్ల. దాని చదువు, మనకు రోజులు గడవడం-అన్నీ ఎలాజరుగుతాయ్? నువ్వు నా సుఖాన్ని, ఇందు భవిష్యత్తును ఆలోచించిచూస్తే నేను చేసినపని తప్పుకాదని నీకే అర్థమౌతుంది. ప్రస్తుతానికి రెండువందలు పంపిస్తున్నాను. మళ్ళీ అవసరమయితే ఉత్తరం వ్రాయి, పంపిస్తాను. ఇప్పుడు నాకు ఏ లోటూ లేదు. సూర్యం చాలా బాగా చూసుకుంటున్నాడు. మిమ్మల్ని విడిచిపెట్టాననే విచారం ఒక్కటే నన్ను బాధపెడుతోంది'' అంటూ ఉత్తరం వ్రాసింది.

జలజ వెళ్ళిపోయి అయిదేళ్ళు గడిచింది. ఒక్కసారయినా ఒకరి ముఖాలు ఒకరు చూసుకోలేదు. ఆమెమాత్రం అవసరమయినప్పుడల్లా డబ్బు పంపిస్తూనే వుంది. తరచుగా యోగక్షేమాలతో ఉత్తరాలు వ్రాస్తూనే వుంది. ప్రతి ఉత్తరంలోనూ 'ఇందూ నువ్వయినా బాగా చదువుకొని పైకిరామ్మా' అంటూ వ్రాస్తుంది. ఆ మాటలు ఇందుమతి మనసులో గాఢంగా నాటుకుపోయాయి. అవే ఆమెలో ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ కలిగించాయి. మంచి మార్కులతో ఇంటరు పాసయి బి.ఏ.లో చేరింది.

'నువ్వు ఎంతవరకు చదవాలనుకుంటావో అంత వరకు చదివించే పూచీ నాది. నువ్వుమాత్రం అర్థాంతరంగా ఆగిపోవద్దు సుమా' అంటూ చెల్లెలి భవిష్యత్తును తన చేతుల్లో పెట్టుకుని దానికొక చక్కని రూపాన్నివ్వాలని తాపత్రయపడుతుండేది.

జలజను చేరదీసిన సూర్యానికి ఆస్తిపాస్తులు బాగా వున్నాయి. ప్రత్యేకంగా ఒక వ్యాపారం అంటూ లేదు. అతను చేసిన వ్యాపారాల్లో కాస్త స్థిరంగా ఎక్కువ కాలం వున్నదల్లా డబ్బు వడ్డీకివ్వడం. జలజతండ్రికి సూర్యం డబ్బు అప్పిచ్చాడు. ఆయన చనిపోయాక ఆ డబ్బును రాబట్టుకుందామని అతను అస్తమానం వాళ్ళింటికి వచ్చేవాడు. అప్పుడే జలజతో సాన్నిహిత్యం పెరిగింది. ఆమె ఆర్థిక పరిస్థితిని ఆధారం చేసుకుని అడపాతడపా అవీయివీ కొనిచ్చేవాడు. చివరకు జలజను వొప్పించి తనతో తీసుకుపోయి పట్నంవెళ్ళి కాపురం పెట్టాడు.

ఇందుమతి చాలాసేపు అక్కను గురించే ఆలోచిస్తూ వుండిపోయింది. అక్కమీద విపరీతమైన అభిమానం పుట్టుకొచ్చింది. అక్కచేసిన పనేమీ తప్పుకాదు అని

నిర్ణయించుకుంది. 'అక్క నిజంగా మంచిపనే చేసింది. లేకపోతే యీ బాధ్యత మోసే వాళ్ళెవరు? అక్క ఎక్కువ చదువు చదివింది గనకనా ఉద్యోగం చెయ్యడానికి? ఆమెకున్నదల్లా ఓమాత్రం చదువు, ఉన్నంతలో నిండుగా కనిపించే అందం. వాటినే ఆమె ఉపయోగించి తననుతాను పోషించుకుని మిగతా వాళ్ళను పోషిస్తోంది'

ఇందుమతి వంటగదిలో కూర్చుని కళ్ళు వత్తుకుంటున్న తల్లిదగ్గరకు వచ్చింది. తల్లిపక్కనే పీటవేసుకుని కూర్చొని "ఛ...ఏడుస్తావేమిటే, జరిగిపోయిందేదో జరిగి పోయింది. మళ్ళీ అవన్నీ తలంచుకుని ఊరికే కుమిలిపోతావెందుకు. అక్కయ్య రమ్మందిగా, రేపు స్టేషనుకు వెళ్దాం, ఊరుకో" అంది.

ఆమె కళ్ళు తుడుచుకుని "నువ్వు వెళ్ళవే, నేనురాను" అంది. అన్నదేగాని కడుపుతీపిని కాదనగలదా? చిన్నకూతురు మళ్ళీ 'వెళ్దాం రావే' అని గట్టిగా పట్టుపట్టేసరికి 'అలాగేలేవే' అంది.

ఆ సాయంకాలం బజారుకు వెళ్ళి అక్కకని చీర, రవికలగుడ్డ కొనుక్కొచ్చింది.

తల్లీకూతుళ్ళిద్దరూ రాత్రి భోజనాలు వేగంగా ముగించుకుని అరగంట ముందుగా స్టేషనుకు చేరారు. కాలం మరీపొడుగ్గా సాగిపోయినట్టనిపించింది వాళ్ళకి.

రైలొచ్చి ప్లాట్‌ఫారం మీద ఆగింది.

తలుపువద్ద నుంచొని కోటి విద్యుద్దీపాల కాంతుల్ని కళ్ళల్లో పెట్టుకుని ప్లాటుఫారం అంతా కలయచూసి, పెట్టెదిగి గబగబా తల్లిదగ్గరకువచ్చి అమాంతం కావలించుకుని ఆమె భుజాల్ని కన్నీటితో తడిపివేసింది జలజ.

అయిదేళ్ళ కాలంలోనూ అనుభవించిన సుఖదుఃఖాల అనుభవాల్ని చెప్పుకొనే 'నా' అన్నవాళ్ళులేని బ్రతుకులోని బాధంతా జ్ఞప్తికొచ్చి ఆమెను ప్రేమతో చల్లని నీడనిచ్చే వృక్షంలా ఆవరించుకుని 'ఈమెను నేను విడిచివుండలేను' అనుకుంది తల్లి.

"అమ్మా! మిమ్మల్ని అందర్నీ వదిలి ఒంటరిదాన్ని అయిపోయాను. ఏంచేయను! ఎందుకో అలా అప్పుడు చేయాలనిపించింది. ఆ ఉద్రేకంలో అలాచేసి మీ అందరికీ దూరం అయిపోయాను. నామీద నీకెందుకమ్మా అంత పగ. నన్ను చూడకుండా యింతకాలం ఎలావున్నావే! నేను తప్పుచేసాను. నిజమే. బిడ్డలు తప్పుచేస్తే అక్కరలేదని తల్లి తరిమేస్తుందా? రోజూ యిలాగే కుళ్ళిపోతున్నాను. మనసుకు శాంతిలేకపోతే ఎంతడబ్బున్నా ఏంలాభం? ఈ మధ్య అస్తమానం నువ్వు కలలోకొస్తున్నావు. ఎప్పట్నుంచో నిన్ను చూడాలనుకుంటున్నాను. నిన్నూ, చెల్లాయినీ చూడాలని పనిలేకపోయినా

హైదరాబాదు ప్రయాణం కట్టించాను" అంది జలజ.

ఆ తల్లి కళ్ళు చెమ్మగిల్లాయి. పవిట చెంగుతో కళ్ళు వత్తుకుని "ఏంచెయ్యనే తల్లీ. నువ్వంటే నాకు ప్రేమలేదూ? కనిపెంచి యిన్నేళ్ళ యీ అనుబంధాన్ని నేనుమాత్రం తెంపుకోగలనా, పిచ్చిదానా. గత్యంతరంలేక, అయినవాళ్ళను కాదనుకోలేక వాళ్ళమధ్యే గుండె రాయిచేసుకుని ఇందును పెంచుకొస్తున్నాను. నీలా వీళ్ళందరినీ ఎదిరించేపాటి ధైర్యం నాకు లేదే అమ్మా" అంది తల్లి ముక్కు చీదుకుంటూ.

ఇందుమతి అంతవరకూ ఓ పక్కన నుంచుని అక్క యీ అయిదేళ్ళలోనూ పోల్చుకోలేనంతగా మారిపోయిందేమిటా అని ఆలోచిస్తోంది.

"బాగా చదువుకుంటున్నావా ఇందూ?" అంది జలజ చెల్లెలితో.

"ఊ" అంది ఇందుమతి.

"రండి, అందాకా పెట్టెలో కూర్చుందాం. ఇక్కడ రైలు అరగంటసేపు ఆగుతుందట"అంటూ వాళ్ళిద్దర్నీ వెంటబెట్టుకుని పెట్టెలోకి వెళ్ళింది.

సూర్యంలేచి నుంచొని వాళ్ళకు నమస్కారంచేశాడు. ఉబికివస్తోన్న కన్నీళ్ళ పొంగును ఆపుకుని కూతుర్నీ, అతన్నీ ఆశీర్వదించింది ఆమె.

మామూలు అనవాయితీ కబుర్లు అయిపోయాక ఇందుమతిని చూసి "ఏమిటి! మరదలు చిక్కినట్టుంది" అన్నాడు సూర్యం.

"బావగారికి వాళ్ళావిడ నాలుగురెట్లు లావెక్కిపోయిందని బాధకాబోలు" అంది ఇందు. సూర్యం, ఇందుమతీ సరదాగా కబుర్లు చెప్పుకొంటుంటే జలజ, తల్లితో యింటి విషయాలు మాట్లాడుతోంది.

తల్లి సంచిలోంచి చీరా, రవికల గుడ్డా బైటికి తీసి; పసుపూ, కుంకుమా, మిఠాయి–ఒక్కొక్కటే అన్నీ ఆమెముందు పెట్టింది.

"ఎందుకమ్మా యివన్నీ. నీ పరిస్థితి నాకు తెలీదూ. అనవసరంగా కొన్నావు" అంది జలజ.

"ఏదోలే తల్లీ. ఇంతకాలానికి మళ్ళీ నువ్వు కనిపించావు. అయిదేళ్ళకిందట నా చేతుల్తో ఏంపెట్టేనో ఏమో, మళ్ళీ యిన్నాళ్ళకి...." అంది బొంగురుపోయి ఆగిపోయిన కంఠంతో.

గార్డు విజిలు వేయడంతోనే "వస్తానే జలజా... వస్తానయ్యా" అంటూ ఆమె

మరొక్కమారు కూతుర్ని దగ్గరకు తీసుకుని ముంగురుల్లు దువ్వి వదల్లేక వదల్లేక వెనక్కు తిరిగి తిరిగి చూస్తూ ఆ తల్లీ, ఆ వెనక ఇందుమతీ పెట్టె దిగిపోయారు.

బండికదిలింది. జలజ కిటికీ దగ్గరకు వచ్చి "ఇందూ! పరీక్షలు అయిపోయాక మీరిద్దరూ ఒకమారు రండి" అంది.

వారం రోజుల తర్వాత జలజ ఉత్తరం రాస్తూ ఆ విషయమే మళ్ళీ గుర్తు చేసింది. ఇందుమతి పరీక్షలు అయినవెంటనే యింకో ఉత్తరంకూడా జలజదగ్గరనుంచి వచ్చింది వూరు రమ్మని.

తల్లికి వెళ్ళాలని లేదు. "ఎందుకులేవే వద్దు" అంది కాని ఇందుమతి పట్టుబట్టి తల్లిని బయలుదేరదీసింది.

జలజ ఉత్తరాలైతే రాసిందిగాని నిజంగా వాళ్ళు వస్తారని అనుకోలేదు. వాళ్ళు రావడం ఆమెకు మహదానందమైంది. సూర్యంకూడా, బండిదిగుతుండగా వాళ్ళను చూసి ఆశ్చర్యపోయి "అదేమిటి ఇందూ! ఉత్తరం అయినా రాయకపొయ్యారూ, స్టేషనుకి వచ్చేవాడినిగా" అన్నాడు.

కూతురి ఇల్లు, డబ్బు, వైభవంచూసి హృదయాన్ని తేలికచేసుకుని రాత్రి పైబడేవరకూ కబుర్లు చెప్తూ కూర్చుండిపోయింది తల్లి. ఇందుమతి కాస్సేపు వాళ్ళ మధ్య కూర్చుని లేచి స్నానంచేసి వచ్చింది. బట్టలుమార్చుకుని దొడ్లో పూలమొక్కలమధ్య గడ్డిలో కూర్చుని అక్కవైభవాన్నే తలపోస్తోంది. ఎప్పుడు చీకటిపడిందో తెలీదు, సూర్యంవచ్చి "ఒక్కర్తివీ బైటకూర్చున్నావేం ఇందూ! లోపలికిపద" అన్నాడు. లేవడానికి చెయ్యి అందించబోతే ఇందుమతి తనేలేచి నుంచుంది.

భోజనాల దగ్గర సెకండ్‌షో సినిమాకు వెళ్దాం అన్నాడు సూర్యం.

"ఇప్పుడెందుకు లెద్దురూ, ప్రయాణంతో అలసిపోయుంటారు, రేపు చూద్దాంలెండి" అంది జలజ.

"నువ్వు మరీనూ. ఆ అలుపు అంతా నీకే వచ్చినట్టుంది. నువ్వు వెళ్ళి బట్టలు మార్చుకో, ఇందుని నేను ఒప్పిస్తాను" అన్నాడు.

'నన్ను ఒప్పించడమేముంది, నేను రడీ' అని అందామనుకుంది ఇందు. కాని అడిగించుకోనిదే 'ఊ' అనడం చులకనగా వుంటుందని మాట్లాడుకూరుకుంది.

జలజ లోపలికి వెళ్ళగానే "ఏం ఇందూ! రావూ?" అన్నాడు.

"రేపు వెళ్దాంలే బావా" అంది ఇందు.

"రేపులో అంత ప్రత్యేకతవుంటే రేపు మళ్ళీ వెళ్దాంలే. ఇంతకీ యిప్పుడొస్తావా రావా?"

"రానంటే ఊరుకుంటావా, సరే"

తల్లిని యింటిదగ్గరే వదిలేసి ముగ్గురూ కారులో సినిమాకి బయలుదేరారు. మధ్యదారిలో "అక్కా! నీకు కారు నడపడం వచ్చే?" అని అడిగింది ఇందుమతి.

"ఏదో, కొద్దిగా. మీ బావే నేర్పారు" అంది జలజ. 'ఎంత అదృష్టవంతురాలివి!' అనుకుంది మనసులో. క్షణంసేపు అక్కమీద కోపంకూడా వచ్చింది. 'అక్కడెక్కడో మారుమూల ఊరూపేరూలేని చిన్నపెంకుటింట్లో నానా యిబ్బందులు పడుతూ తాము బతుకుతుంటే యిక్కడ అక్క అందాల మేడలో రాజభోగం అనుభవిస్తూ వుంటున్నదే!'

సినిమా చూసొచ్చాక చాలాసేపటివరకు ఇందుమతికి నిద్రపట్టలేదు. సినిమాలో బావపక్కనే కూర్చున్నప్పుడు మధ్యలో బావ తన చేతిని పట్టుకున్నాడేమిటి?

ఆ రాత్రంతా ఆమెకు కలత నిద్రతోనే గడిచింది.

మర్నాడు ఉదయం సూర్యం కనిపించలేదు. సాయంకాలం వీధి పెరటి గార్డెన్‌లో పువ్వులుకోస్తూ మేడమీదకు చూసినప్పుడు సూర్యం ఎప్పటినుంచి కిటికీముందు నుంచుని చూస్తున్నాడో, సూటిగా ఆమెవైపే చూస్తూవున్నాడు! ఆమె తనవైపు చూడగానే ఓ చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వు కాస్సేపు గిలిగింతలుపెట్టి అంతలోకే ముళ్ళ తీగలా గుచ్చుకుపోయింది. ఇందుమతి తలవంచుకుని హడావిడిగా యింట్లోకి వెళ్ళిపోయింది.

ఆరోజు భోజనాలదగ్గర జలజ చెప్పింది "రేపు కారులో సింహాచలం పిక్‌నిక్‌కు వెళ్దామన్నారు బావ. అమ్మకూడా వస్తోంది దైవదర్శనం చేసుకోడానికి" అంది.

ఇందుకు వెళ్ళాలనిలేదు. "నేను రాలేనక్కా" అంది.

రాత్రికి సూర్యం వచ్చినప్పుడు జలజ చెప్పిందిగాబోలు "ఏం ఇందూ! రానన్నావట. భలేదానివే. నీ గురించనే యీ పిక్‌నిక్ ఏర్పాటు చేశాను. అలా కారు నడపడంకూడా నేర్చుకుందువుగాని" అన్నాడు.

ఇందుమతి మరి ఎదురుచెప్పలేదు.

మర్నాడు అంతా సింహాచలం వెళ్ళారు. ఇందుమతి ఎప్పుడూ దేవుని ఉనికి గురించి ఆలోచించలేదు. ప్రస్తుతంవరకూ ఆవిషయంలో తన అభిప్రాయం యిదీ

అని ఖచ్చితంగా చెప్పలేదు. అందరితోపాటు గర్భగుడిలో దేవుడికి నమస్కరించి మంటపంలోకొచ్చి కూర్చుంది. జలజ, ఆమెతల్లి పత్రిపూజ చేయిస్తున్నారు. సూర్యంకూడా అక్కడే వున్నాడు. ఎక్కువసేపు అక్కడ వుండలేక మంటపంలోకి వచ్చి ఇందుమతిని పలకరించి "పూజ ఇప్పట్లో తెమిలేట్టులేదు. కారు డ్రైవింగ్ నేర్చుకుంటానన్నావుకదూ, వస్తావా?" అన్నాడు.

"ఓ" అంటూ చెంగుచెంగున దూకుతూ లేడిలా కారుదగ్గరకు పరుగెత్తింది ఇందుమతి. ఆ వెనకే సూర్యం వచ్చాడు. కారులో ఎక్కించుకుని చాలాదూరం తీసుకెళ్ళాడు. వాళ్ళు తిరిగి వచ్చేసరికి బాగా ఆలస్యమైంది. జలజ, ఆమెతల్లి కొండదిగొచ్చి చాలాసేపు ఎదురుచూస్తూ నుంచున్నారు.

ఇంటికి వెళ్ళేవరకు తల్లి ఏమీ మాట్లాడలేదు. వెళ్ళగానే కూతుర్ని పక్కగదిలోకి పిలిచి ముఖంవాచేలా చీవాట్లు పెట్టింది - కారు డ్రైవింగ్ నేర్చుకోడానికి అంతపాటి అదృష్టవంతులమా మనం". జలజకూడా చెల్లెల్ని పిలిచి మెల్లగా మందలించింది. "కారు నడపడం నేర్చుకోకపోతే ఏంపోయింది? అవతల పూజ జరుగుతూంటే దగ్గరవుండనన్నా వుండక్కర్లే. చదువుకొని బొత్తిగా నాస్తికురాలిలా తయారయ్యావేమిటి?" అంది.

ఇందుమతికి రోషం వచ్చింది 'బావతో సరదాగా మాట్లాడితే అక్కకెందుకంత కుళ్ళు? అనుకుంది. అక్కమీది కోపంతో 'అక్కను మరీ ఏడిపించాలి' అని నిర్ణయించుకుంది.

ఆ రాత్రి భోజనం చెయ్యలేదు. జలజవచ్చి అడుగుతే "ఆకలిగా లేదు, ఇప్పుడు చెయ్యను" అని చెప్పింది.

"భోంచేయలేదట, ఏమిటి?" అంటూ పరామర్శించడానికి వచ్చాడు సూర్యం.

"అబ్బే, మరేంలేదు. ప్రయాణంపేరుచెప్పి మూడు నాలుగుసార్లు టిఫిన్లు, గుళ్ళో ప్రసాదం, అరటిపళ్ళూఅవీ తిన్నాంకదూ, ఆకలిగాలేదు. సర్లేగాని ఏం చేస్తున్నావ్ బావా యిప్పుడు? కాస్సేపు కూర్చోకూడదూ పేకాడుకుందాం" అంది ఇందు.

"ఆ విషయం యింకా మెల్లగా చెప్తావేమిటి! రా, కిందహాల్లో కూర్చుందాం" అన్నాడు.

ఇద్దరూ హాల్లోకి వచ్చారు. టేబిలును దగ్గరకు లాక్కొని పేకాడుతూ కూర్చున్నారు. జలజ వచ్చి చూసి మౌనంగా వెళ్ళిపోయింది. ఆమెను ఓరకంటచూసి లోలోపలే

నవ్వుకొంది ఇందు. లేకపోతే బావతోకలిసి తిరగ్గూడదట. ఎంతసొంతం అయిపోయాడు బావ!-అనుకొంది.

రాత్రి పదకొండు దాటేవరకూ పేకాడుతూనే కూర్చున్నారు. ఎవరూ పల్లెత్తుమాట అనలేదు. తల్లికూడా చూసింది. "ఇంకా నిద్రపోలేదుటే" అని మాత్రం అంది.

"నువ్వెళ్ళిపడుకోవే. నీకెందుకు" అంది ఇందు. ఆమె నోరు నొక్కుకుని పళ్ళు పటపట కొరుక్కుని కొరకొరా చూస్తూ లోపలికి వెళ్ళిపోయింది.

ఉదయం కాఫీ తాగాక "మధ్యాహ్నం బండికి వెళ్ళిపోతున్నాం, బట్టలు సర్దుకో"అంది తల్లి.

"నువ్వు మరీనూ.వచ్చేవరకు తొందర, వెళ్ళేవరకు తొందర. అంతగా వెళ్ళానుకుంటే నువ్వెళ్ళు, మరోవారం రోజులుపోయాక నేను వస్తాలే" అంది ఇందుమతి.

జలజకూడా అక్కడేవుంది. చెల్లెలు ఇంకా కొద్దిరోజులు వుంటానంటే-పోనీలేవే అమ్మా, ఉండనియ్యి-అని అనలేదు."అదేమిటే ఇందూ! నువ్వు వుండిపోతే అమ్మ ఒక్కర్తీ వెళ్తుందా?ఏదోపనుందని అంటోంది. వీలుచూసుకుని మళ్ళీ ఒకసారి రావచ్చులే" అంది.

'చూశావా!...చూశావా!! ఎంతకుళ్ళో దీనికి. బావతో సర్దాగా తిరుగుతున్నానని చూడలేకపోతోంది' అనుకుంది ఇందు.

మధ్యాహ్నం సూర్యం వచ్చాక అడిగేసింది ఇందు "ఏంబావా! ఆమాత్రం అన్నం పెట్టలేకపోతే ఎందుకు పిలవడం? రమ్మని ఆప్యాయంగా పిలవడం పొమ్మని కసిరికొట్టడానికేనా ఏమిటి?"

సూర్యానికేమీ అర్థంకాలేదు. జలజను పిలిచి అడిగితే ఆమె అంతా చెప్పింది.

"పోనీ వుండనియ్యి, వుంటానంటోందిగా. అంతగా అవసరమైతే కారులో నేను దిగబెట్టివస్తాగా" అన్నాడు.

హేళనగా నవ్వుతూ అక్కవైపు చూసింది ఇందు. జలజ తలవంచుకుని మౌనంగా వుండిపోయింది.

"చూడూ, నీతో పనుంది, మేడమీదకు రా" అంటూ చరచరా పైకివెళ్ళాడు సూర్యం. జలజ అతని వెనకనే వెళ్ళింది. పావుగంట తర్వాత సూర్యం తలుపుల్ని తీసుకుని

విసురుగా బైటికి వెళ్ళిపోయాడు. జలజమాత్రం ఆ సాయంకాలంవరకూ ఎవరికీ కనిపించలేదు.

రాత్రి పడుకున్నప్పుడు వెంటనే నిద్రపట్టక పెరటి తలుపులు తీసుకుని పెరట్లోకి వచ్చింది ఇందు. పెరట్లో వెన్నెల పుచ్చపువ్వులా కాస్తోంది. సన్నజాజి పూలపరిమళం పెరట్లో అంతటా వ్యాపించివుంది. ఆమె మెల్లగా పందిరికిందకు వెళ్ళి అయిదారుపూలను కోసుకుని గుప్పెట్లో పెట్టుకుని వాసన చూస్తోంది.

ఎవరో మృదువుగా ఆమె భుజంమీద చెయ్యివేసారు. తుళ్ళిపడి చూసింది. సూర్యం ఆమె పక్కనచేరి చిరునవ్వులు గుమ్మరిస్తున్నాడు!

"వస్తావా అలా వెళ్ళి తోటలో కూర్చుందాం" అన్నాడు.

"అమ్మో...అక్కయ్య..." అంది.

"ఎడ్చింది. మొద్దు నిద్రా అదీను. ఇప్పుడు పడుకుంటే మళ్ళా పొద్దున్నే అది లేవడం".

ఇద్దరూ వెళ్ళి వొత్తుగా గడ్డివున్నచోట కూర్చున్నారు.

వాళ్ళచుట్టూ వెన్నెల! వాళ్ళమీద మామిడిచెట్టు గుబురుల్లోంచి వెన్నెల జారి పొడలుపొడలుగా కిందంతా పరుచుకునివుంది.

"ఇందూ! నువ్వు యిక్కడే వుండిపోగూడదూ, యూనివర్శిటీలో ఆనర్సు చదువుకుందువుగాని" అన్నాడు సూర్యం.

"కాని, బి.ఏ ఒక సంవత్సరం అయిపోయిందిగా" అంది ఆమె.

"వెధవ ముష్టి బి.ఏ. ఎందుకూ? ఒక సంవత్సరం పోతేపోయింది, ఇక్కడ ఆనర్సులో జాయినవ్వు. ఇంత బంగళావుంది. కారుంది. ఇక్కడే వుండి రోజూ కారులో వెళ్ళిరావచ్చు. నిజం చెప్తున్నా ఇందూ నువ్వంటే నాకెంత యిష్టమనుకున్నావ్! ఆ రోజు స్టేషన్లో నిన్ను చూసి ఆశ్చర్యపోయాను. ఆనాటి పరికిణీ జాకెట్టు ఇందుమతేనా అనిపించింది నిన్ను చూడగానే. నిన్ను ఒకసారి యీవూరు రమ్మని మీ అక్కచేత నేనే అడిగించాను. ఆ తర్వాత ఉత్తరాలుకూడా నేనే రాయించాను. ఇదంతా దేనికంటావ్? నీకోసమే. నీకు యిక్కడ ఏ విషయంలోనూ లోటుండదు. మీ అమ్మకూడా నీతోపాటు యిక్కడేవుంటుంది....ఏమంటావ్?"

లోపల్నుంచి వాళ్ళమ్మగాబోలు దగ్గుతెరవచ్చి ఒకటే దగ్గుతుంటే చటుక్కునలేచి

వెళ్ళిపోయింది ఇందు. ఆ రాత్రి ఆమెకు సరిగా నిద్రేపట్టలేదు. మనసునిండా కుప్పతెప్పలుగా ఆలోచనలు! ఒకవైపు యూనివర్శిటీ చదువు, బంగ్లా జీవితం. కారు షికార్లు! మరోవైపు అక్కయ్యకు బావ అన్యాయం చేస్తాడేమోనన్న మనసుగోల! ఆలోచనల్తో అలసిపోయి ఎప్పుడో తెల్లవారుఝామున నిద్రపోయింది.

ఉదయం లేచేసరికి బాగా ఆలస్యమయ్యింది. అంతా ఎవరిపనుల్లోవాళ్ళు మునిగిపోయారు. సూర్యం పనుందని పొద్దున్నే వెళ్ళిపోయాడట. మధ్యాహ్నం భోజనానికి వచ్చాడుగాని ఇందుమతికి కనిపించనేలేదు. సాయంకాలం నాలుగ్గంటలవేళ బావతో మాట్లాడుదామని మేడమీదకు వెళ్తోంటే పైగదిలోంచి గట్టిగా మాటలు వినిపిస్తున్నాయి. బావ అక్కను ఎందుకో తిడుతున్నాడు. గట్టిగా కసురుకుంటున్నాడు. ఆమె నీరసంగా జవాబు చెప్తోంది. ఇందుమతి ఓ నిమిషం ఆ మెట్లమీదే నిలబడిపోయింది.

ఎక్కువసేపు వాళ్ళ ఘర్షణ ఆమె వినదలచుకోలేదు. గబగబా కిందకు దిగొచ్చి హాల్లో కుర్చీలో కూలబడి ఆలోచిస్తోంది. బావ మాటల్లో యింత కాఠిన్యం ఆమె ఎప్పుడూ వినలేదు.

సూర్యం తలుపులు తీసుకుని చరచరా మెట్లుదిగి బైటికి వెళ్ళిపోతున్నాడు. "ఏమిటి బావా...ఏమైంది?" అని ఇందుమతి అడుగుతున్నా సమాధానం యివ్వకుండా "తర్వాత చెప్తాలే ఇందూ" అంటూ అవతలికి వెళ్ళిపోయాడు. అతని ముఖంలోని కోపం, ఆ కళ్ళల్లోని చింతనిప్పులకాష్టం చూసి భయపడింది ఇందు. అతను వెళ్ళిపోయాక అక్క గదిలోకి వెళ్ళింది.

జలజ మంచంమీద పడుకుని వుంది. ఆమె కళ్ళు చెమ్మగిల్లి వున్నాయి. చెల్లెల్ని చూడగానే ఆమెకు కనిపించకుండా కన్నీళ్ళు వత్తుకుని "రావే రా" అంది.

ఇందుమతి వచ్చి కూర్చున్నాక "ఏమిటే కాస్సేపు వచ్చి కూర్చునేదానివి, బొత్తిగా తప్పించుకు తిరుగుతున్నావ్?" అంది.

ఆ మాటల్లోని ఆప్యాయత ఇందుమతిని కలచివేసింది. 'ఇంతమంచి అక్కకా తను ద్రోహం తలపెడుతోంది?' అనుకుంది.

ఇందుమతి జవాబు చెప్పకపోవడం చూసి జలజే తిరిగి అంది- "ఏమిటాలో చిస్తున్నావు ఇందూ, బావని గురించేనా?"

ఇందుమతి అదిరిపోయింది. "అబ్బే...అబ్బే" అంది. అంతకన్నా యింకేమీ చెప్పలేకపోయింది. అంతసులభంగా అబద్ధాన్ని సృష్టించగలిగేంత చాకచక్యం ఆమెకు

యింకా అలవడలేదు.

జాలిగా నవ్వింది జలజ. చెల్లెలి ముఖాన్ని తనవైపు తిప్పుకుని "పిచ్చిపిల్లా! నాకంతా తెలుసు. జీవితం అంటే మనం ఆడుకునే బొమ్మలాటలాంటిది కాదు. అలా అనుకునే నేను మోసపోయాను. ఈనాడు దానిలోని కష్టసుఖాలు తెలుసుకున్నాను. నువ్వు యింకా చిన్నదానివి. ఏళ్ళు పైబడ్డాయన్నమాటేగాని లోకజ్ఞానం అలవడలేదు. చూస్తూ చూస్తూ నిన్నాగోతిలోకి ఎలాదింపను?"

ఇందుమతి మాట్లాడలేదు. అక్కమాటల్లోని అర్థం ఆమె ఊహించుకోలేక పోలేదు. మౌనంగా లేచివెళ్ళిపోయింది. కిందకి వచ్చి గదిలోకి అడుగుపెట్టింది. అక్కడ తల్లి తీరిగ్గా కూచుని పనిమనిషితో కబుర్లుచెప్తోంటే దొడ్లోకొచ్చి మామిడిచెట్టుకిందకెళ్ళి కూచుంది.

మనసేమిటో చికాగ్గావుంది.

'ఏమిటి అక్క? తన సుఖాన్నీ, శ్రేయస్సునూ కోరుతోందా? లేక అసూయ పడుతోందా?'

అక్కకు తనమీద అసూయ ఎందుకుంటుంది? తనంటే అక్క ప్రాణం యిస్తుంది. చదువుసంధ్యలు అన్నీ అక్కేచూస్తోంది. తను పైకిరావాలని, సుఖపడాలని అక్కతపన. అంత మంచి అక్క తననుచూసి అసూయపడడమేమిటి? సూర్యంబావతో కలిసి సరదాగా కబుర్లు చెప్పుకోనివ్వదు. ఈ పరిచయానికి ఎన్నో చిలవల్నీ పలవల్నీ చేర్చి ఎందుకు ఆలోచిస్తోంది?'

ఇందు ఆలోచనలకు అంతరాయంగా మృదువుగా ఆమె భుజంమీద ఎవరో చెయ్యివేశారు. వెనక్కితిరిగిచూస్తే అక్క!

"ఏమిటి ఆలోచిస్తున్నావ్ ఇందూ! నీ సంతోషానికి నేను అడ్డుతగులుతున్నానని కదూ ఆలోచిస్తున్నావ్? అక్కేమిటి నాకు నీతులు చెప్తోంది అనికదూ అనుకుంటున్నావ్? ఒక విషయం నువ్వు గుర్తుంచుకో ఇందూ. నీమీద నాకు ద్వేషంకాని, అసూయకాని లేవు. నువ్వు సుఖంగా సంతోషంగా వుండడమే నాకు కావలసింది. నువ్వు బావతో అంతచనువుగా వుండడంలో నాకు ఎలాటి అభ్యంతరమూ లేదు. కాని ఆ చనువు అంతటితో ఆగిపోదని అనుభవపూర్వకంగా చెప్తున్నాను. బావగురించి నీకు తెలిసినది చాలా తక్కువ. తెలియనిది చాలా వుంది. పూర్తిగా తెలిసేవరకు నిన్ను నువ్వు అదుపులో పెట్టుకోమనిమాత్రమే నేను చెప్పదలచుకున్నాను. ఒకప్పుడు నీ మాటలకి నేను అడ్డుచెప్పేదాన్ని-కాని యిప్పుడు నువ్వు పెద్దదానివైపోయావు. మంచిచెడ్డల్ని స్వతంత్రంగా

ఆలోచించి నిర్ణయించుకోగల జ్ఞానం నీకు అలవడింది. ఏపనైనా ఆలోచించి మరీ చెయ్యి. చేతులు కాలేక ఆకులు పట్టుకోవడంవల్ల ప్రయోజనం లేదు"

జలజ ఇందుభుజంమీద చెయ్యేసి ఇంట్లోకి తీసుకొచ్చింది "రాత్రి బాగా పొద్దుపోయింది. పడుకో. ఈ రాత్రికి బావరారు. నేనూ తలుపులన్నీ వేసుకుని వెళ్ళి పడుకుంటాను" అంటూ ఇందుమతి చేతిని తనచేతుల్లోకి తీసుకుని ప్రేమతో గట్టిగా నొక్కి వెళ్ళిపోయింది.

ఇందుమతి పడుకున్నదన్నమాటేగాని ఆమె ఆలోచనలన్నీ అక్కమీదే. పైకి కనిపించేంత ఆనందంగా అక్కలేదన్న విషయం ఆమెకు అర్థమైంది. నీ గుండెల్లో అగ్ని పర్వతాలున్నాయక్కా. బైటపడకుండా బలవంతంగా వాటిని నీలోనే అణిచేసుకుంటున్నావు' అనుకుంది.

ఆలోచిస్తోంటే యిప్పుడన్నీ ఆమెకు స్పష్టంగా అర్థమౌతున్నాయి. అంతపెద్ద యింట్లో బావకివున్నది ఒక్క బీరువాయే.

ఈ వారంపదిరోజులూ బావకోసం కలుసుకోడానికి ఆ యింటికి వచ్చినవాళ్ళు ఎవరూ లేరు. కారైతే వుందిగాని కారు పెట్టుకోడానికి ఆ యింట్లో షెడ్డులేదు. ఆ చుట్టుపట్ల చాలా యిళ్ళకి యింటి యజమాని నేమ్‌ప్లేట్లు వున్నాయిగాని యీ యింటిగేటుకి బావనేమ్ ప్లేటు లేదు. ఇవన్నీ ఒక్కొటొక్కటీ గుర్తొచ్చినప్పుడు ఇందుమతికి బావ యీ యింటికి అతిథిమాత్రమే అనే విషయం అర్థమైంది. యీ ఇల్లు బావదేకాని బావ యీ యింటికి అతిథి. ఈ ఇంట్లో అక్కవుంటోందిగాని దీనికామె యజమానురాలు కాదు.

ఆలోచిస్తూ ఆలోచిస్తూనే ఎప్పుడో మెల్లగా నిద్రలోకి జారుకుంది.

ఉదయం సూర్యం వచ్చాడు. ఇందుమతి చూసిందిగాని అతన్ని పలకరించలేదు. అతనే దగ్గరకువచ్చి "ఏమిటి అలావున్నావు? తొందరగా ముస్తాబయి రా. అలా కార్లో బజారుకి వెళ్ళి వద్దాం. జాజిమొగ్గల నెక్లస్ అంటే నీకిష్టంకదూ. కొనుక్కుందువుగాని" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. మౌనంగా లోపలికివెళ్ళిపోతోంటే స్నానంచేసి వస్తానని, తయారుగా వుండమని చెప్పి సూర్యం మేడమీదకి వెళ్ళిపోయాడు.

స్నానంచేసి బట్టలు మార్చుకుని వచ్చేసరికి ఆమె పెట్టెబేడా రిక్షాలో పెడుతోంది. అతనికి అర్థంకాక "ఎక్కడికి?" అన్నాడు.

"మా ఊరికి" అంది ఇందుమతి. అక్కతో చెప్పివద్దామని మేడమీదకు వెళ్ళింది తల్లిని వెంటబెట్టుకుని.

ఆవెనకనే సూర్యంకూడా వెళ్ళాడు.

"ఏం వెళ్ళిపోతున్నావ్?" అన్నాడు.

"ఏమీ లేదు, వెళ్ళిపోదామనుకున్నాం. వెళ్ళిపోకుండా ఎన్నాళ్ళని మీ యింట్లో వుంటాం. వారంపైనే అయ్యింది అక్కడ మా యింటిని వొదిలివచ్చి. ఇల్లేకాదు అక్కడ నాకోసం ఎదురుచూసేవాళ్ళుకూడా వున్నారు" అంది.

సూర్యం కొయ్యబొమ్మలా నిశ్చేష్టుడైపోయాడు. అతను తేరుకుని కిందకు వచ్చి చూసేసరికి ఇందుమతీ,, ఆమె తల్లీ రిక్షా ఎక్కి కూచున్నారు. జలజ వాళ్ళకు చెయ్యిఊపుతూ వీడ్కోలు చెప్తోంది.